ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
సోమవారం 15 సెప్టెంబరు 2025 | 5



తెలుగు రాష్ట్రాల కరాటే పోటీల్లో ఉమ్మడి జిల్లాకు ప్రథమస్థానం 7
భీమేశ్వరాలయంలో శరన్నవరాత్రి ఉత్సవ ఏర్పాట్లకు రాటముహూర్తం 7

ఉత్సాహంగా జిల్లా అథ్లెటిక్ పోటీలు

- రాష్ట్రస్థాయి మీట్‌కి ఎంపికైన 60మంది క్రీడాకారులు హాజరు
- ఏపీఎస్పీ కమాండెంట్



ఏపీఎస్పీలో జిల్లాస్థాయి ఎంపికల పోటీల్లో హైజంప్ చేస్తున్న క్రీడాకారుడు

సర్పవరంజంక్షన్,సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్పీలో కాకినాడ జిల్లా అథ్లెటిక్ క్రీడా పోటీల్లో క్రీడాకారులు రెట్టించిన ఉత్సాహంతో పాల్గొన్నారు. అండర్-14, 16, 18, అండర్-20 విభాగాల్లో వేర్వేరుగా బాలుర, బాలికల విభాగంలో నిర్వహించిన షాట్‌పుట్ రన్నింగ్, లాంగ్అండ్ హైజంప్,జావలిన్‌త్రో క్రీడల్లో పలువురు విద్యార్థులు ప్రతిభకనబరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కాకినాడ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టీవీఎస్ రంగారావు, సెక్రటరీలు సుబ్రహ్మణ్యేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 7.30గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు జూనియర్ అథ్లెటిక్స్ జిల్లాస్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలను ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ ముద్రగడ నాగేంద్రరావు ప్రారంభించారు. జిల్లాస్థాయినుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు గోల్డ్ మెడల్స్, సిల్వర్ మెడల్స్ పంపిణీచేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా శారీరక, మానసిక ధృడత్వం లభిస్తుందన్నారు. క్రీడలతో మంచి ఖ్యాతితోపాటు క్రీడారంగంలో లభించిన రిజ ర్వే షన్‌తో ఉద్యోగాలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యతోపాటు చదువులో రాణించి తల్లిదండ్రులతోపాటు గురువులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఇక్కడ జరిగిన పోటీల్లో 250మంది బాలబాలికలు పాల్గొనగా 67మంది బాల, బాలికలను జిల్లా తరపున ఎంపిక చేశామని, వీరు ఈనెల ఏలూరు అల్లూరు సీతారామరాజు స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని కోచ్‌లు పీవీ రెడ్డి, పి. ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో పీడీలు ఎం.హరిబాబు, భాను, త్రిపుర, వీరబాబు, సంతోష్, కిరణ్ రాజేష్ పాల్గొన్నారు.

ఎంచక్కా.. వ్యాపారం!



బెల్ట్ జోరు..ఆపేవారెవరు..



కొవ్వూరు మండలంలో 16 గ్రామాలు ఉండగా 7 మద్యం షాపులు మాత్రమే ఉన్నాయి.. అంటే 9 గ్రామాల్లో మద్యం షాపులే లేవు. తాళ్లపూడి మండలంలో 18 గ్రామాలు ఉండగా 5 మద్యం షాపులు ఉన్నాయి. అంటే 13 గ్రామాల్లో లేవు.. ఇక కోనసీమ, కాకినాడ జిల్లాల్లో అయితే మండల కేంద్రాలకు గ్రామాలకు మధ్య దూరం చాలానే ఉంటుంది.. దీంతో మద్యం షాపులు లేని గ్రామాలను వ్యాపారులు పంచుకుని అనధికారికంగా బెల్ట్ షాపులు ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో ఎక్సయిజ్ అధికారులు అటు వైపు చూసే సాహసం చేయడంలేదు..ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలోనూ దాదాపు ఇదే పరిస్థితి ఉంది. ప్రస్తుతం ప్రతి గ్రామంలోనూ మద్యం వ్యాపారం మూడు సీసాలు.. ఆరు గ్లాసులుగా సాగుతూనే ఉంది..

అన్నవరంలో దేవస్థానం వద్ద బ్రాంది షాపు ఉండదు.. కానీ అక్కడ మద్యం యథేచ్ఛగా లభ్యమవుతోంది.. ఎలాగంటే బెల్ట్ మహత్యం.. దేవస్థానం దిగువున ఉన్న దుకాణాల్లో యథేచ్ఛగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి.. ఆ సెంటర్‌కు వెళ్లి ఎవరిని అడిగినా బెల్ట్ షాపు ఎక్కడనేది చూపిస్తారు. కానీ మన ఎక్సయిజ్ అధికారులకు కనిపించదు.. ఎందుకో..! తలుపులమ్మ లోవకు వెళ్లేందుకు జాతీయ రహదారి దిగి.. పక్కనే కిరాణా కొట్టులోకి వెళితే చాలు మద్యం యథేచ్ఛగా లభ్యమవుతోంది.. నిత్యం అమ్మకాలు సాగుతూనే ఉంటాయి.. ఆ దుకాణం వాహన డ్రైవర్లు అందరికీ సుపరిచితమే..అయినా అధికారులకు పట్టదు. ఎందుకంటే పేరుకు అనధికారికమైనా.. అధికారికంగా ప్రైవేటు వ్యాపారుల కనుసన్నల్లోనే దుకాణాలు సాగుతున్నాయి.. - (రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఎక్సయిజ్ అధికారులు బెల్ట్ తీయలేకపోతున్నారు..గత టీడీపీ ప్రభుత్వంలో బెల్ట్‌షాపులను పూర్తిగా నిర్మూలించారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో మాత్రం బెల్ట్‌షాపులు ఇబ్బడి ముబ్బడిగా పెరిగి పోయాయి..ప్రతి పల్లెలోనూ షాపులు వెలిశాయంటే అతిశయోక్తి కాదేమో.. అయినా ఎక్సయిజ్ అధికారులు చూసీచూడనట్టు వదిలేస్తున్నారు.. ఎందుకంటే ప్రస్తుతం పట్టణాలు, మేజర్ పంచాయతీల్లో మాత్రమే మద్యం దుకాణాలు ఉన్నాయి. గ్రామాల్లో మద్యం దుకాణాలు దాదాపుగా కనుమరుగయ్యాయి. దీంతో పల్లెజనం బెల్టు షాపులపై ఆధారపడక తప్పడం లేదు. కూటమి ప్రభుత్వం తెచ్చిన కొత్త మద్యం పాలసీ కారణంగా గ్రామాల్లో మద్యం షాపులు ఉండే అవకాశం లేదు. ఇదే అదనుగా ప్రైవేటు మద్యం వ్యాపారులు తలో కొన్ని గ్రామాలు పంచేసుకొని బెల్టు షాపులను నిర్వహిస్తున్నారు. అటు బెల్టుల నుంచి.. ఇటు ప్రైవేటు మద్యం షాపుల నుంచీ ఎంతో కొంత అందుతుండడంతో ఒక దెబ్బకు రెండు తాయిలాల మాదిరిగా ఎక్సైజ్ కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తోంది.

గ్రామాల్లో మందు కరువు

ప్రభుత్వ మద్యం పాలసీలో ప్రైవేటు మద్యం షాపులకు లైసెన్స్‌లు ఇచ్చే సమయంలో మండల కేంద్రాలను యూనిట్‌గా తీసుకున్నారు. అంటే మండలంలో ఎక్కడైనా మద్యం షాపు ఏర్పాటు చేసుకోవచ్చు. సాధారణంగా మండల కేంద్రంలో జన సమ్మర్దం ఎక్కువ. దీంతో షాపులు దక్కించుకున్న వాళ్లంతా మండల కేంద్రాల్లో దుకాణాలు తెరిచారు. పెద్ద గ్రామాల్లోనూ మద్యం షాపులు లేకుండా పోయాయి. అక్కడక్కడా అరకొరగా మాత్రమే దుకాణాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలో దాదాపుగా 1030 గ్రామాలు ఉంటే 80 శాతం గ్రామాల్లో మద్యం షాపులే లేవు.దీంతో ప్రైవేటు వ్యాపారులు గ్రామాల్లో బెల్టు షాపులు తెరిచారు. పెట్టుబడి లేని వ్యాపారం కావడంతో పల్లెల్లో చిరువ్యాపారులు పోటీపడుతున్నారు.

455 దుకాణాలు.. 1030 గ్రామాలు

తూర్పు గోదావరిలో 138, కాకినాడ జిల్లాలో 171, కోనసీమ జిల్లాలో 146 ప్రైవేటు మద్యం దుకాణాలు ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లాలో 19 మండలాలు, నగరపాలక సంస్థ 1, నగర పాలక సంఘాలు 2, రెవెన్యూ గ్రామాలు 303 ఉండగా రూరల్ జనాభా 12లక్షలు, అర్బన్ జనాభా 8 లక్షలు ఉన్నారు. కాకినాడ జిల్లాలో 21 మండలాలు, కార్పొరేషన్ 1, నగర పంచాయతీలు 2, రూరల్, రెవెన్యూ గ్రామాలు 412 ఉండగా రూరల్‌లో 5 లక్షలు, అర్బన్‌లో 10లక్షల జనాభా.. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 22 మండలాలు,నగరపాలక సంఘం 1, రూరల్, రెవెన్యూ గ్రామాలు 316 ఉన్నాయి. రూరల్‌లో జనాభా 17 లక్షలు, అర్బన్ 3 లక్షలు ఉన్నారు. ఈ లెక్కన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 1030 కిపైగా రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. మొత్తం 455 ప్రైవేటు మద్యం షాపుల్లో 400 వరకూ పట్టణాలు/నగరాల్లోనే ఉన్నాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని 35 లక్షల వరకూ జనాభాలో 10 లక్షల మందికి మద్యం తాగే అలవాటున్నా వాళ్లు 50 షాపుల్లోనే సర్దుకోవాల్సి వస్తోంది.

- కలిసొచ్చిన మద్యం పాలసీ
- మండలం యూనిట్‌గా కేటాయింపు
- గ్రామాల్లో మద్యం షాపులు నిల్
- బెల్టు షాపులు తప్పని పరిస్థితి
- గ్రామాలు పంచుకొన్న వ్యాపారులు
- పట్టించుకోని ఎక్సయిజ్ అధికారులు

అడకత్తెరలో ఎక్సయిజ్ శాఖ..

బెల్టు షాపులు చట్టరీత్యా అంగీకారం కాదు. పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది కేసులు నమోదు చేయవచ్చు. కానీ కొన్ని పరిస్థితుల వల్ల వాళ్లేమీ చేయలేకపోతున్నారు. అరకొరగా కేసులు నమోదు చేస్తున్నారు. బెల్టు షాపుల నుంచి వారికి నెలవారీ మామూళ్లు వెళతాయనేది బహిరంగ రహస్యమే. మరో వైపు ఆయా బెల్టు షాపులు నడుపుతున్న లైసెన్స్‌డ్ ప్రైవేటు మద్యం దుకాణాల నుంచీ ఎంతో కొంత ముడుతోంది. పైగా బెల్టు షాపుల వల్ల అమ్మకాలు పెరుగుతాయి. దీంతో లక్ష్యాలనూ సులభంగా చేరుకోవచ్చు. ఖజానాకు ఆదాయం సమకూరుతోంది. ఈ నేపథ్యంలో చూసీ చూడనట్టు వదిలేస్తున్నారు.

రెడీఎస్సీ!

నేడే ఉపాధ్యాయ అభ్యర్థుల తుది జాబితా విడుదల

- మొత్తం 1241 పోస్టులు
- రేపు,ఎల్లుండి వెబ్ ఆప్షన్లు
- 19న నియామకపత్రాలు
- 20,21న జాయినింగ్

(కాకినాడ/రూరల్-ఆంధ్రజ్యోతి)

ఉపాధ్యాయ ఉద్యోగాలకు సంబంధించిన అభ్యర్థుల ఎంపిక తుది జాబితా సిద్ధమైంది. ఇప్పటికే ఎంపికైన డీఎస్సీ అభ్యర్థుల వివరాలు వెల్లడించి వారి ధ్రువపత్రాల పరిశీలన చేపట్టారు. తుది జాబితాలను సోమవారం సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయం, మెగా డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ https: //apdsc.apcfss.inలో అందుబాటులో ఉంచనున్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన మెగా డీఎస్సీ-2025 రిక్రూట్‌మెంట్ ముగింపు దశకు చేరుకుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 1241 పోస్టులు ఉన్నాయి.గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ ఇంజినీరింగ్ కళాశాలలో గత నెల 28 నుంచి ఈ నెల 13వ తేదీ వరకు ఏడు విడతల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించారు. అందుబాటులో ఉన్న ఖాళీలకు పోస్టింగ్స్ కేటాయింపుపై 16,17 తేదీల్లో వెబ్ ఆప్షన్ స్వీకరించి 19న ఉత్తర్వులు జారీ చేస్తా రు. నియామకపత్రాలు పొందిన కొత్త టీచర్లు వారికి కేటాయించిన పాఠశాలల్లో 20,21 తేదీల్లో రిపోర్టు చేయాల్సి ఉంది. 22 లేదా 23 నుంచి దసరా సెలవుల్లో శిక్షణ ఉంటుంది. శిక్షణ బృందాలను సిద్ధం చేశారు. ఈ మేరకు ఉపాధ్యాయ అభ్యర్థులు సన్నద్ధం కావాల్సి ఉంది. ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ, మున్సిపల్, ట్రైబల్ వెల్ఫేర్, జువనైల్ వెల్ఫేర్ యాజమాన్యాల వారీగా,పోస్టుల వారీగా కేటాయింపులు చేస్తారని సమాచారం.



పోస్టులు ఇవీ..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా డీఎస్సీలో 1241 పోస్టులు ఉండగా 63,004 దరఖాస్తులు వచ్చాయి.38,617 మంది పరీక్షలు రాశారు. స్కూల్ అసిస్టెంట్ 608, పీఈటీలు 210, ఎస్జీటీ 423 పోస్టులు ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్ పోస్టులు తెలుగు 65, హిందీ 78, ఇంగ్లీష్ 95, గణితం 64, ఫిజికల్ సైన్స్ 71, బయోలాజికల్ సైన్స్ 103, సోషల్ 132, వ్యాయామ విద్య 210 ఉద్యోగాలతో పాటు సెకండరీ గ్రేడ్ టీచర్ల ఉద్యోగాలు ఉన్నాయి. ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమానికి సంబంధించి ఫిజికల్ సైన్స్ 3, బయోలాజికల్ సైన్స్ 4, స్కూల్ అసిస్టెంట్ వ్యాయామ విద్య 1, ఎస్జీటీలు 104 మొత్తం 112 ఉద్యోగాలు భర్తీ చేయనున్నారు. ప్రత్యేక విద్యకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా 13 టీజీటీలు, మూడు పీఈటీలు, 15 ఎస్జీటీలతో కలిపి 31 పోస్టులు ఉన్నాయి. జోన్ 2 (ఉమ్మడి తూర్పు, పశ్చిమ, కృష్ణా)కు సంబంధించిఏపీఆర్ఎస్,ఏపీఎంఎస్, ఏపీఎస్‌డబ్ల్యూ, బీసీ, సోషల్ వెల్ఫేర్‌కు సంబంధించి పీజీటీ 49, టీజీటీ 272, పీడీ 3, పీఈటీ 24తో కలిపి మొత్తం 348 పోస్టులు భర్తీ చేయనున్నారు.



ఇంత జాప్యమా?

- డిగ్రీ సీట్ల కేటాయింపుపై దోబూచులాట
- పలుమార్లు తేదీలు మార్పు
- ఇప్పటికే మూడు నెలలు ఆలస్యం
- తరగతుల ప్రారంభం ఎప్పుడో మరి
- ఏపీ ఉన్నత విద్యామండలి తీరుపై విస్మయం

(ఆంధ్రజ్యోతి-పిఠాపురం)

డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియకు సంబంధించి ప్రభుత్వం జీవో జారీ చేసి రెండు నెలలైంది. ఆపై అడ్మిషన్ల ప్రక్రియ,సీట్ల కేటాయింపు పూర్తిచేయాల్సి ఉండగా ఇప్పటివరకూ పూర్తి కాలేదు. దీంతో విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడిచినా డిగ్రీ ఫస్టియర్ తరగతులే ఇప్పటికీ ప్రారంభం కాలేదు. ఈ ప్ర క్రియ అంతా నిర్వహించాల్సిన ఏపీ ఉన్నత విద్యామండలి పనితీరు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

డిగ్రీ కళాశాలల్లో మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభంపై ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. ఇప్పటికే అడ్మిషన్ల ప్రక్రియ ఆలస్యం కాగా సీట్లు కేటాయింపు పలుమార్లు వాయిదాలు పడడంతో విద్యార్థులకు ఎదురుచూపులు తప్పడంలేదు. ఇప్పటికే ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలు వచ్చి ఐదునెలలు దాటగా విద్యాసంవత్సరం ప్రారంభమై మూడునెలలు దాటింది. ఇప్పటికీ ఈ ప్రక్రియ కొలిక్కి రాకపోవడంతో విద్యార్థులు సీట్ల కేటాయింపుకోసం ఎదురుచూపులు చూస్తున్నారు. ఇప్పటికే ఇతర రాష్ట్రాల్లో డిగ్రీ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం కాగా ఇక్కడ మాత్రం సీట్లు అలాట్‌మెంట్‌ను పూర్తి చేసేందుకు ఏపీ ఉన్నత విద్యామండలి అపసోపాలు పడుతోంది.

మూడు జిల్లాల్లోను..

కాకినాడ జిల్లాలో కాకినాడ, తుని, పిఠాపురం, ఏలేశ్వరం, జగ్గంపేట, పెరుమాళ్లపురం, పెద్దాపురం తదితర ప్రాంతాల్లో ఐదు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, మూడు అటానమస్ కళాశాలలు, 46 ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ఉండగా, తూర్పుగోదావరి జిల్లాలో ఆరు ప్రభుత్వ కళాశాలలు, ఒక అటానమస్ కళాశాల, 40 ప్రైవేటు కళాశాలల ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఏడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, ఒక అటానమస్, 45ప్రైవేటు డిగ్రీకళాశాలలున్నాయి. ఈ కళాశాలలు అన్నింటిలోనూ రాష్ట్ర ప్రభుత్వం అధీనంలోని ఏపీ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలోనే అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతోంది.

చర్చలు, నిర్ణయాలు, జీవోలు

డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి అనుసరించాల్సిన విధానాలు, డిగ్రీ కోర్సులు తదితర అంశాలపై ప్రభుత్వం వివిధ వర్గాల ప్రతినిధులు, విద్యావంతులతో చర్చలు జరిపి తుది నిర్ణయం తీసుకుంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయించి ప్రభుత్వం జూలై 15న జీవో జారీ చేసింది. తదుపరి అడ్మిషన్ షెడ్యూల్ ప్రకటించాల్సిన ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హైయ్యర్ ఎడ్యుకేషన్ తీవ్ర జాప్యం చేసింది. ప్రభుత్వ జీవో జారీ తర్వాత వారం వ్యవధిలోనే అడ్మిషన్లు ప్రారంభించాల్సి ఉండగా ఇందుకు అవసరమైన ఆన్‌లైన్ పోర్టల్‌ను సిద్ధం చేయలేదు. ఎట్టకేలకు 35 రోజుల తర్వాత అడ్మిషన్ల ప్రక్రియ షెడ్యూల్‌ను ప్రకటించింది.

ఆపై వాయిదాలు..

ఎట్టకేలకు ఆగస్టు 20న ప్రభుత్వం, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోను విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆఖరి తేదీ 26 అని తొలుత ప్రకటించారు. దీని ప్రకారం సీట్లు అలాట్‌మెంట్ పూర్తి చేసి సెప్టెంబరు 1 నుంచి తరగతులు ప్రారంభిస్తామని ప్రకటించారు. సాంకేతిక సమస్యలతో దరఖాస్తుల ఆన్‌లైన్‌కు ఇబ్బందులు ఎదురవ్వడంతో రెండు విడతలుగా దరఖాస్తుల స్వీకరణ గడువును సెప్టెంబరు 4 వరకూ పొడిగించారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తి చేసి స్పెషల్ కేటగిరీ అభ్యర్థుల వెరిఫికేషన్, కోర్సుల ఆప్షన్ల నమోదు పూర్తయింది.

సీట్ల కేటాయింపు ఎప్పుడో?

దరఖాస్తుల స్వీకరణ, ధ్రువీకరణపత్రాల పరిశీలన పూర్తి చేసి ఈనెల 6న విద్యార్థులకు సీట్లు కేటాయింపు చేస్తామని ముందుగా ప్రకటించారు. చివరిక్షణంలో 8వతేదీకి మార్పు చేశారు. మళ్లీ 10న సీట్ల కేటాయింపు ఉంటుందని చెప్పి ఎటువంటి సమాచారం లేకుండా వాయిదా వేశారు. అసలు సీట్లు ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేని పరిస్థితి ఉంది.

ఇప్పటికే ఆలస్యం..

డిగ్రీ మొదటిసంవత్సరం తరగతులు ప్రారంభం ఇప్పటికే ఆలస్యమైంది. సాధారణంగా జూలై రెండో వారంలోపే అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేసి తరగతులు ప్రారంభించాల్సి ఉండగా గత వైసీపీ ప్రభుత్వం అనుసరించిన అనాలోచిత విధానాలవల్ల ఇది ఆగస్టు వరకూ ప్రారంభించలేని పరిస్థితి ఉంది. ఈ విద్యాసంవత్సరంలో జూలై 15న అడ్మిషన్ల ప్రక్రియకు సంబంధించి ప్రభుత్వం జీవో జారీచేసి ఆగస్టు మొదటి వారానికి ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించినా ఏపీ ఉన్నత విద్యామండలి అధికారుల నిర్వాకంతో జాప్యం తప్పలేదు. ఇప్పటికే విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు నెలలు దాటింది. డిగ్రీ ప్రవేశాలకోసం ఎదురుచూస్తున్నవిద్యార్థులకు మాత్రం ఎదురుచూపులే మిగిలాయి.సీట్లకేటాయింపు విషయంలో సాంకేతిక సమస్యలతోనే అలాట్‌మెంట్ ప్రక్రియ ఆలస్యమవుతున్నట్లు చెబుతున్నారు. డిగ్రీ సీట్లు కేటాయింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని విద్యావేత్తలు కోరుతున్నారు. ఈ ప్రక్రియ పూర్తి చేస్తే తరగతుల ప్రారంభానికి వారం పడుతుందని, ఈలోగా మళ్లీ విజయదశమి సెలవులువస్తాయని వారు చెప్తున్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి జూన్‌లోనే అడ్మిషన్ల ప్రక్రియ పూర్తిచేస్తే జూలైలోనే తరగతులు ప్రారంభించవచ్చుని అంటున్నారు.

పోగొట్టుకున్న రూ.10 లక్షల విలువైన బంగారు ఆభరణాల అప్పగింత 7

గోదావరి పరవళ్లు
- 5,06,438 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల 7

గడ్డిమందు తాగి పండ్ల వ్యాపారి ఆత్మహత్య 7

పిచ్చికుక్క దాడి 7

ఎట్టకేలకు..

- యుద్ధ విమాన మ్యూజియంలోకి సందర్శకులకు అనుమతి
- ప్రయోగాత్మకంగా ప్రవేశ రుసుం

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి సందర్శకులు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్న టీయూ-142 యుద్ధ విమాన మ్యూజియం ఎట్టకేలకు ఆదివారం నుంచి వినియోగంలోకి వచ్చింది. కౌడా అధికారులు యుద్ధ విమానం మ్యూజియం లోపలికి సందర్శకులకు అనుమతిస్తూ ప్రవేశ రుసుం ప్రయోగాత్మకంగా అమలుచేశారు.రూ.20,రూ.40గా యుద్ధ విమానాన్ని తిలకించేందుకు అధికారులు రేట్లు తాత్కాలికంగా ఖరారు చేశారు.

కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో రూ.5.89కోట్ల గోదావరి అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ(గుడా), ప్రస్తుతం కౌడా నిధులతో థీమ్ పార్కుపేరిట టీయూ-142యుద్ధ విమాన మ్యూజియం నిర్మాణ పనులను 2020, అక్టోబరులో ప్రారంభించారు. బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యంతో మ్యూజియం నిర్మాణ పనులపై ప్రభావం చూపింది. అసెంబ్లీ ఎన్నికల ముందు హడావుడిగా అసంపూర్తి నిర్మాణ పనులు పూర్తి చేయకుండానే 2023, ఫిబ్రవరిలో గత ప్రభుత్వం యుద్ధ విమాన మ్యూజియాన్ని హడావుడిగా ప్రారంభించి చేతులు దులుపుకుంది. ఎన్నికల అ నంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభు త్వం యుద్ధ విమాన మ్యూజియం అసంపూర్తి, యుద్ధ విమానం లోపల ఏసీ, విద్యుదీకరణ, బ్యూటిఫికేషన్, సెంట్రల్ లైటింగ్, ప్రవేశ ద్వారం, రోడ్డు డివైడర్, చిన్నారుల పార్కు తదితర పనులను పూర్తి చేసేలా స్థానిక ఎమ్మెల్యే పంతం నానాజీ కృషి చేశారు. ఎట్టకేలకు రూ.7.09కోట్ల వ్యయంతో యుద్ధ విమాన మ్యూజియం నిర్మాణ పనులన్నీ పూర్తికావడంతో కలెక్టర్, కౌడా ఇన్‌చార్జి, జేసీ ఆదేశాల మేరకు కౌడా సెక్రటరీ కాళీ బాబు ప్రయోగాత్మకంగా ఆదివారం ట్రయల్ రన్ తో ప్రారంభించారు. ముందుగా ప్రవేశరుసుం రూ.20, రూ.40గా నిర్ణయించి సందర్శకులకు టిక్కెట్లను ప్రయోగాత్మకంగా విక్రయించి యుద్ధ వి మాన మ్యూజియం లోపలికి వెళ్లేందుకు అనుమతించారు. జేసీ ఆదేశాలపై సందర్శకులను అనుమతించామని, తొలిరోజు 500మందిని వచ్చారని తెలిపారు. మ్యూజియం సందర్శన వేళలు, టిక్కెట్ల ఖరారు తదితర వాటిపై జేసీ సమీక్ష అనంతరం నిర్ణయిస్తామన్నారు. ఈ సందర్భంగా విమానం లోపల అధికారులు, సందర్శకులతో కలిసి 20నిమిషాలపాటు ఎల్ఈడీ స్క్రీన్‌పై మ్యూజియం విశిష్టత, దేశభద్రత, రక్షణకోసం డిస్‌ప్లే, వీడియో, ఆడియో ద్వారా తెలియజేసే సమాచార వ్యవస్థ, గేమింగ్ జోన్, విజ్ఞానం, విమాన టేకాఫ్, ల్యాండింగ్ తదితర వివరాలను తెలియజేసే వ్యవస్థలను ప్రదర్శించారు.

ఇవిగో ప్రత్యేకతలు..

టీయూ-142 యుద్ధ విమానాన్ని రష్యా దేశం నుంచి కొనుగోలు చేశారు. కార్గిల్ యుద్ధంలో ఇది విశేష సేవలందించింది. ఈ విమానం ఒక్కసారి ఫ్యూయల్ నింపుకుని ప్రపంచ దేశాలను కేవలం 16 గంటల్లో చుట్టివచ్చే సామర్థ్యం దీని సొంతం. ఇది గంటకు 925 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. విమానం పొడవు, వెడల్పులు 50 మీటర్లు, రెక్కల పొడవు 50 మీటర్లు ఉంటుంది. దీని బరువు 90వేల కిలోలు ఉండడం గమనార్హం. ప్రపంచంలోనే అతి భారీ,పురాతన యుద్ధ విమానాల్లో ఒకటైన టీయూ-142 ఎం ఎయిర్ క్రాఫ్ట్ భారత నావికాదళం వైమానిక విభాగంలో 28ఏళ్లపాటు దేశానికి విశేష సేవలందించింది. సముద్ర తీర గస్తీ, జలాంతర్గామి నిరోధక సేవలు అందించడంలో ఖ్యాతి గడించిన ఈ యుద్ధ విమానం 2017లో నేవీనుంచి వైదొలిగి తమిళనాడులోని అరక్కోణం బేసల్ ఎయిర్ స్టేషన్ ఐఎన్ఎస్ రాజసంలో విశ్రాంతి తీసుకుంటోంది. ఈ విమానాన్ని తమిళనాడునుంచి కాకినాడ బీచ్‌కు 14 భారీ వాహనాల ద్వారా పురాతన యుద్ధ విమానాన్ని తెనేజా ఏరో స్పేస్ లిమిటెడ్ సంస్థ తీసుకువచ్చింది.



యుద్ధ విమానం వద్ద సందర్శకుల సందడి

గోదావరి పరవళ్లు

5,06,438 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల


ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచి విడుదలవుతున్న వరద నీరు

ధవళేశ్వరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద గోదావరి పరవళ్లు తొక్కుతూ సముద్రంలోకి ప్రవహిస్తోంది. ఆదివారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ ధవళేశ్వరం, ర్యాలి ఆర్మ్‌లోని మొత్తం గేట్లను 1.5 మీటర్లు.. మద్దూరు, విజ్జేశ్వరం ఆర్మ్‌లోని మొత్తం గేట్లను మీటరు మేర పైకి ఎత్తి 5,06,438 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. దీంతో ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 10 అడుగులుగా నమోదైంది. ఎగువన భద్రాచలం వద్ద 36.10 అడుగుల వరకు పెరిగిన నీటి మట్టం నిలకడగా కొనసాగుతోంది.


వరద నీటిలో ఉన్న గండిపోశమ్మ అమ్మవారి ఆలయం

వరద నీటిలో గండిపోశమ్మ ఆలయం

దేవీపట్నం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా దేవీపట్నం మండలంలో గోదావరి మళ్లీ పెరుగుతుంది. ప్రసిద్ధి పుణ్యక్షేత్రం మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయం వరద నీటిలోనే ఉంది. అలాగే పాపికొండల విహారయాత్ర పర్యాటక బోట్లను నిలిపివేశారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ద్రాక్షారామలో రాట ముహూర్తం


ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో రాట ముహూర్తం చేస్తున్న ఈవో తదితరులు

ద్రాక్షారామ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో ఈనెల 22 నుంచి జరగనున్న దేవీశరన్నవరాత్రి ఉత్సవ ఏర్పాట్లకు ఆదివారం శాస్త్రోక్తంగా రాట ముహూర్తం జరిపారు. ఉదయం ఆలయ ఈవో అల్లు వెంకట దుర్గాభవానీ, సత్యంవాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం, కృష్ణకుమారి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. 10.58 గంటలకు రాట ముహూర్తం చేశారు. ఆలయ అర్చకులు, వేదపండిత బృందం కార్యక్రమం జరిపించారు. సర్పంచ్ కొత్తపల్లి అరుణ, నాటక అకాడమీ డైరెక్టరు పెంకే అన్న పూర్ణ, కూటమి నాయకులు పెంకే సాంబశివరావు, సంపత్, ఏడుకొండలు, భక్తులు పాల్గొన్నారు.

'లోవ'లో భక్తుల కోలాహలం


క్యూలో బారులుతీరిన భక్తులు

రూ.6.14 లక్షల ఆదాయం


తలుపులమ్మ అమ్మవారు

తుని రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. క్యూలలో బారులు తీరి అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం ఏర్పాటు చేసిన వసతి గదుల్లో కుటుంబ సమేతంగా వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. ఆలయానికి వివిధ విభాగాల ద్వారా రూ.6.14 లక్షల ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో వి.విశ్వనాథ రాజు తెలిపారు.

పంటకాలువలో వృద్ధురాలి మృతి


వృద్ధురాలి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

ఆత్రేయపురం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పంటకాలువలో వృద్ధురాలు ప్రమాదవశాత్తు మృతిచెందిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురానికి చెందిన అవిడి సత్యవతి(60) ఆదివారం ఉదయం లొల్ల పాత బ్రిడ్జి పంటకాలువలో శవమై తేలింది. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. సత్యవతి శనివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంటికి రాలేదని ఆమె తమ్ముడు సూర్యారావు తెలిపాడు. మృతదేహాన్ని పరిశీలించి తన అక్కగా నిర్ధారించాడు. సంఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి


నాగబాబు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అల్లవరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం డి.రావులపాలెం గ్రామానికి చెందిన కాంట్రాక్టరు వంటెద్దు నాగబాబు (40) ఆదివారం ఆక్వా చెరువుల వద్ద విద్యుదాఘాతానికి గురై మరణించాడు. నాగబాబు గుండెపూడిలో తాను కౌలు సాగు చేస్తున్న ఆక్వా చెరువుల వద్ద పాడైన ఏరియేటర్‌ను బాగు చేసేందుకు చెరువులో దిగి విద్యుఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడని పోలీసులు తెలిపారు. రొయ్యల చెరువుల వద్ద నాగబాబు మృతదేహాన్ని వెలికితీసి అల్లవరం ఎస్ఐ బి.సంపత్‌కుమార్ దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికై అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. నాగబాబు మృతి పట్ల పంచాయతీ రాజ్ డీఈఈ అన్యం రాంబాబు, సొసైటీ అధ్యక్షుడు వేగిరాజు వెంకట్రాజు, లిక్కా వెంకటప్రసాద్, ఆకుల లక్ష్మణరావు, పోతుల చంద్రబోస్ సంతాపం వ్యక్తం చేశారు.

కరాటే పోటీల విజేత ఉమ్మడి జిల్లా

పేరూరులో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల కరాటే పోటీలు




పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ హరీష్‌మాధుర్

అమలాపురం రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం పేరూరు పీఆర్కే ఫంక్షన్ హాలులో ఆదివారం పవర్‌కిక్ షోటోకాన్ కరాటే డూ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి తెలుగు రాష్ట్రాల కరాటే పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రథమస్థానంలో నిలిచింది. పోటీలను ఆదివారం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ ప్రారంభించారు. 6 ఏళ్ల నుంచి 18 ఏళ్ల వయసు గల సుమారు 952 మంది క్రీడాకారులు పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచినట్టు చీఫ్‌ఆర్గనైజర్ పడాల అంజి తెలిపారు. కటాస్, కుమిటీ విభాగాల్లో ఈ పోటీలను ఆర్గనైజింగ్ కార్యదర్శి చిక్కం సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రథమస్థానం, తెలంగాణకు ద్వితీయ స్థానం దక్కింది. వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వివిధ విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. గంటి హరీష్‌బాలయోగితో పాటు టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు పతకాలు, ప్రశంసాపత్రాలను అందించారు. పోటీల్లో ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.

మండపేటలో ముగిసిన రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలు


జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

మండపేట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో 2రోజులపాటు జరిగిన 49వ రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. రాష్ట్రంలోని 17 జిల్లాల నుంచి వచ్చిన 17 జట్లకు చెందిన క్రీడాకారులు పాల్గొనగా జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే బాలురు, బాలికల జట్లను ఎంపిక చేశారు. అక్టోబరు 8 నుంచి 12 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని నోయిడాలో జరిగే జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైన జట్ల వివరాలను టెన్నికాయిట్ రాష్ట్ర అసోసియేషన్ కోశాధికారి రిఫరీ కుంచే రమేష్ తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు జట్ల ఎంపిక

జట్లకు ఎంపికైన వారు..

బాలుర జట్టుకు రామారావు(కాకినాడ), వినయ్ (కాకినాడ), బి.సిద్దార్ద (శ్రీకాకుళం), రాహుల్(విజయనగరం), చంటిబాబు (తూర్పు గోదావరి), పి.సాగర్ (అనకాపల్లి), కె.చంద్రమౌళి (విజయనగరం), బి.ఉదయ్‌కుమార్ (శ్రీకాకుళం)... బాలికల జట్టుకు సంబంధించి పి.మౌనిక (విజయనగరం), జి.హేమమాధురి (తూర్పు గోదావరి), పి.రేణుక (విజయనగరం), జి.సుప్రియ (అనంతపురం), కె.నారాయణమ్మ(విశాఖ), కె.ఇందు (విజయనగరం), కె.అనిత(కాకినాడ) ఎంపికయ్యారు. జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో విజేతలై వారిని 2027లో అంతర్జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేస్తారని రమేష్ తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన వారికి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పట్టణానికి చెందిన వేగుళ్ల చైతన్య బాబు, కాకినాడకు చెందిన రెడ్‌క్రాస్ ఛైర్మన్ వైడీ రామారావు, ముత్యాల బాలమురళీకృష్ణ బహుమతులు అందజేశారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు గెడా శ్రీనివాస్, మండపేట జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎమ్ ముంగర వెంకట్రాజు, పి.తవిటయ్య, కేవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

కార్మికుల జీవితాల్లో కానరాని మార్పులు


ప్రసంగిస్తున్న ఉమామహేశ్వరరావు

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు

సామర్లకోట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నా కార్మికుల జీవితాల్లో మార్పులు కానరావట్లేదని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం కాకినాడ జిల్లా సామర్లకోట లయన్స్ క్లబ్ భవనంలో సామర్లకోట, అమలాపురం ఏపీబీసీఎల్ హమాలీ వర్కర్ల యూనియన్ 5వ మహాసభను ఘనంగా నిర్వహించారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 6.5 లక్షల మంది ప్రభుత్వ, ప్రైవేటు గోదాముల్లో కార్మికులుగా పనిచేస్తున్నారని వారికి శ్రమకు తగిన రీతిలో వేతనాలు అందట్లేదన్నారు. తొలుత సీఐటీయూ పతాకాన్ని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారెడ్డి ఆవిష్కరించారు. రాష్ట్రంలోని 17 ఏపీబీసీఎల్ డిపోల నుంచి 150 మంది హమాలీలు హాజరయ్యారు. సీఐటీయూ నాయకులు దువ్వా శేషుబాబ్జీ, ఎం.మదన్‌మోహన్, రాష్ట్ర కార్యదర్శి విప్పర్తి కొండలరావు, రామారావు, వి.అప్పలరాజు, సోమేష్, ఎం.రామారావు, ఎం.ప్రసాద్ పాల్గొన్నారు.

హమాలీ వర్కర్స్ నూతన కార్యవర్గం

ఆంధ్రప్రదేశ్ బెవరేజస్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ నూతన కార్యవర్గ ఎన్నికలను ఆదివారం సామర్లకోటలో నిర్వహించారు. అధ్యక్షుడిగా విప్పర్తి కొండలరావు, కార్యదర్శిగా ఎం.మదన్‌మోహన్, గౌరవాధ్యక్షుడిగా ఉమామహేశ్వరరావు, కోశాధికారిగా బత్తుల కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఎన్వీ సుబ్బారెడ్డి, ఎన్.ప్రసాదరావు, రామారావు, మూర్తి, రాముడు, మల్లికార్జున్, సాంబయ్య, కార్యదర్శులుగా కొండలరావు, తిరుపేక్, శ్రీనివాసు, సూర్యచంద్ర, మణిప్రసాద్, పవన్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా అప్పలరాజు, ఆర్.సుబ్బారాయుడు, చిన్న, ప్రశాంత్, మోహన్‌రాము ఎన్నికయ్యారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు బలరామపురం విద్యార్థి


బంగారు పతకాలతో శ్రీనివాస్

రౌతులపూడి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి జావెలిన్ త్రో,షార్ట్‌పుట్ పోటీలకు కాకినాడ జిల్లా రౌతులపూడి హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న బలరామపురం గ్రామానికి చెందిన పైల శ్రీనివాస్ ఎంపికయ్యాడు. ఆదివారం కాకినాడ ఏపీ ఎస్సీలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించి ఈనెల 25,26న ఏలూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎమ్ కోళ్ల రాంబాబు తెలిపారు.

16 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం

ఎటపాక, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): 16 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు ఆదివారం రాత్రి అల్లూరి జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నంలోని శిథిలమైన ఓ ఇంట్లో స్వాధీనం చేసుకున్నారు. పురుషోత్తపట్నం సమీపంలోని సెయింట్‌ఆన్స్ పాఠశాల సమీపంలో శిథిలమైన ఇంట్లో పీడీఎస్ బియ్యం నిల్వలు ఉంచినట్టు తహసీల్దార్‌కు సమాచారం అందింది. దీంతో తహసీల్దార్ కారం సుబ్బారావు సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. ఆ ఇంట్లో బస్తాల్లో నిల్వలు చేసిన బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. 16 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేసి పురుషోత్తపట్నంలోని రేషన్ దుకాణానికి తరలించారు.

పోగొట్టుకున్న రూ.10 లక్షల విలువైన బంగారు ఆభరణాల అప్పగింత


రూ.10 లక్షల విలువైన బంగారు ఆభరణాలు అప్పగిస్తున్న అన్నవరం ఎస్ఐ

అన్నవరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం సెక్యూరిటీ అప్రమత్తతతో ఆదివారం రాత్రి ఒక వ్యక్తి పోగొట్టుకున్న సుమారు రూ.10 లక్షల విలువైన బంగారు ఆభరణాలు తనచెంతకు చేరాయి. వివరాల్లోకి వెళితే కాకినాడ నుంచి విశాఖపట్నం వెళ్తున్న కాజా మొయినుద్దీన్ అన్నవరం దేవస్థానం టోల్‌గేట్ సమీపంలో తన బంగారు ఆభరణాలు కలిగిన బ్యాగ్‌ను వేరే వ్యక్తుల బ్యాగ్‌లో కలసిపోవడంతో దీనిని గమనించిన దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది వాటిని తీసుకుని అన్నవరం ఎస్ఐ హరిబాబు సమక్షంలో మొయినుద్దీన్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా అతడు అన్నవరం దేవస్థానం సెక్యూరిటీ వ్యవస్థను అభినందించారు.

పిచ్చికుక్క దాడి

ఎనిమిది మందికి గాయాలు

గండేపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామం పాతూరులో శనివారం రాత్రి పిచ్చికుక్క గ్రామస్తులపై దాడి చేసి 8 మందిని గాయపరిచింది. పిచ్చికుక్క దాడితో గ్రామస్తులు భయంతో పరుగులు తీశారని స్థానికులు తెలిపారు. గాయపడిన 8 మంది జెడ్.రాగంపేట ప్రభుత్వాసుపత్రిలో చేరారు. గాయపడ్డవారిలో పవన్, చంద్రం, అంకం శ్రీను, రావుల నారాయణరావు, రావిపాటి అబ్బు, చింతపలి శ్రీను, బోను శ్రీను, వినోద్ ఉన్నారు.

రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో తూర్పుగోదావరి జిల్లాకు ప్రథమం


పోటీల్లో ప్రథమస్థానం సాధించి కప్ అందుకుంటున్న తూర్పుగోదావరి జిల్లా బాలురు

బిక్కవోలు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో తూర్పుగోదావరి జిల్లా బాలురు ప్రథమ స్థానం, బాలికలు తృతీయ స్థానం సాధించారు. అనంతపురం జిల్లా ధర్మవరం మండలం రామాపురంలో ఈ నెల 12 నుంచి జరిగిన పదో అండర్-19 రాష్ట్ర స్థాయి బాలబాలికల బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. పోటీల్లో బాలుర నుంచి తూర్పుగోదావరి జిల్లా జట్టు చిత్తూరు జిల్లాపై విజయం సాధించి ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. ఈ టీమ్‌లో బిక్కవోలుకు చెందిన వినయ్, మణికంఠరెడ్డి, కైలాష్, హేమంత్ ఆడారు. కెప్టెన్‌గా వ్యవహరించిన వినయ్ అనంతపురం జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నుంచి టీమ్ సభ్యులతో పాటు కప్ అందుకున్నారు. అలాగే జిల్లా బాలికలు శ్రీకాకుళం జట్టుపై తలపడి విజయం సాధించి మూడో స్థానంతో సరిపెట్టుకున్నారు. ఈ టీమ్‌లో బిక్కవోలుకు చెందిన చాందినిప్రియ, అలేఖ్య, శిరీష, భార్గవి పాల్గొన్నారని జిల్లా బాల్‌బాడ్మింటన్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ముప్పన స్వామి, ముప్పన వీర్రాజు, సభ్యులు సీతాపతిరావు తెలిపారు. బాలుర టీమ్ కోచ్‌గా పీఈటీ మోహనరావు, బాలికలకు సునీత కోచ్‌లుగా వ్యవహరించారు.

ఖతర్ నుంచి సురక్షితంగా స్వగ్రామానికి..

కోనసీమ మహిళ రాక


కనకమహాలక్ష్మి

అమలాపురం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఖతర్ దేశంలో తీవ్ర అనారోగ్యం, యజమాని పని ఒత్తిడి కారణంగా ఇబ్బందులు పడుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లంకుర్రు మొక్కలతిప్ప జైభీమ్ నగర్‌కు చెందిన గోడి కనకమహాలక్ష్మిని కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్(కేసీఎం) సహకారంతో సురక్షితంగా స్వగ్రామానికి తీసుకొచ్చినట్టుడీఆర్వో కె.మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. మహాలక్ష్మి వాట్సాప్, వీడియో సందేశాల ద్వారా తన యజమానులు, ఏజెంట్ పెడుతున్న చిత్రహింసలపై చేసిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ స్పందించారు. ఆమెను స్వదేశానికి తీసుకురావడానికి కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ నోడల్ అధికారి, డీఆర్వో కె.మాధవిని ఆదేశించారు. దీనిపై స్పందించిన ఆమె విదేశీ రాయబార కార్యాలయంతో సంప్రదింపులు జరిపి అక్కడి ఏజెంట్ల సహకారంతో కనకమహాలక్ష్మిని సురక్షితంగా స్వదేశానికి రప్పించినట్టు కేసీఎం సెంటర్ సమన్వయ అధికారి గోళ్ల రమేష్ తెలిపారు. ఖతర్‌లో అధిక పని ఒత్తిడి, యజమానుల వేధింపులు, సరైన ఆహారం లేకపోవడం వల్ల తీవ్ర అనారోగ్యం పాలై తాను చివరికి ఆత్మహత్యకు కూడా పాల్పడేందుకు సిద్ధమైన సమయంలో సాయం చేసినందుకు కోనసీమ కలెక్టర్, కేసీఎం బృందానికి కనకమహాలక్ష్మి కృతజ్ఞతలు తెలియజేశారు.

నేటి నుంచి యూటీఎఫ్ రణభేరి యాత్ర

దివాన్‌చెరువు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక, విద్యా రంగ సమస్యలపై యూటీఎఫ్ తలపెట్టిన రణభేరి యాత్ర సోమవారం నుంచి ప్రారంభమవుతుందని ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి సీహెచ్ దయానిధి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈనెల 15న సోమవారం ఈ రణభేరి యాత్ర తునిలో బయలుదేరి ఆరోజు కాకినాడ జిల్లాలో పర్యటిస్తుందన్నారు. 16న అల్లూరి సీతారామరాజు జిల్లాలో యాత్ర సాగుతుందని, 17న తూర్పుగోదావరి జిల్లాలోని గోకవరం నుంచి ప్రారంభమై కోరుకొండ, రాజానగరం, రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం రూరల్, కడియం మీదుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని మండపేటకు చేరుకుంటుందని తెలిపారు. ఉపాధ్యాయులకు బోధనేతర విధుల నుంచి విముక్తి కల్పించాలని, పాఠశాలలో ఒత్తిడి లేకుండా పనిచేసే వాతావరణం కల్పించాలని, ఉమ్మడి సర్వీస్ రూల్స్ ద్వారా ప్రమోషన్లు కల్పించాలని, 12వ పీఆర్సీ కమిషనర్‌ను నియమించి ఐఆర్ వెంటనే ప్రకటించాలని, డీఏలు విడుదలచేసి బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

రాజానగరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పాల ప్యాకెట్ కోసం నడిచి వెళ్తున్న వ్యక్తిని మోటార్‌సైకిల్ ఢీకొనడంతో మృతిచెందాడు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోలమూరు గ్రామ సెంటర్‌లో జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మోర్త సూరిబాబు(40) ఆదివారం ఉదయం పాల ప్యాకెట్ కోసం షాపునకు నడుచుకుంటూ వెళ్తుండగా వేగంగా వస్తున్న మోటార్‌సైకిల్ బలంగా ఢీకొంది. సూరిబాబు తలకు బలమైన గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు రాజానగరం ఎస్ఐ ఎస్.ప్రియకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని...

రాజనగరం మండలం నరేంద్రపురం చెలగంపాడు కాలనీకి చెందిన దాకారపు సీతారామయ్య(56) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడికి మద్యం తాగే అలవాటు ఉంది. ఈనెల 10న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పాలచర్లలోని తాడేలమ్మ ఆలయం సమీపంలో గోదావరి టౌన్‌షిప్ లేఅవుట్‌లో వేప చెట్టుకు పంచెతో ఉరేసుకున్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి కుమారుడు మణికంఠ ఫిర్యాదుతో ఎస్ఐ ప్రియకుమార్ కేసు నమోదు చేశారు.

గడ్డిమందు తాగి పండ్ల వ్యాపారి ఆత్మహత్య

సామర్లకోట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట స్టేషన్ సెంటర్ వద్ద పండ్ల వ్యాపారం చేసుకునే తలారి గోవిందు (పులిరాజు 45) దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ రెండు రోజుల క్రితం జీవితంపై విరక్తి చెంది గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న పులిరాజును చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించి వైద్యం అందించగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందినట్టు సామర్లకోట పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నట్టు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సామర్లకోట పోలీసులు తెలిపారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

మరిడమ్మ దేవస్థానంలో అన్నదానం



పెద్దాపురం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మరిడమ్మ దేవస్థానంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. 55 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని సహాయ కమిషనరు కె.విజయలక్ష్మి తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.



హెచ్ఎంల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ రాజశేఖరం

'హెచ్ఎంల సమస్యల పరిష్కారానికి కృషి'

కాకినాడ రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రామకృష్ణ పబ్లిక్ పాఠశాల ఆడిటోరియంలో ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన చెవ్వూరి రవి అభినందన సభను కాకినాడ జిల్లా అధ్యక్షుడు ఎం.కూర్మారావు అధ్యక్షతన ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ హెచ్ఎంలు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర అధ్యక్షులకు, ప్రభుత్వానికి అనుసంధానంగా ఉంటానన్నారు. అనంతరం రవిని ఎమ్మెల్సీ, హెచ్ఎంల సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి చినరాజు, నాయకులు సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, పుల్లయ్య, ఎస్టీయూ నాయకుడు శ్రీనివాస్, పీఆర్టీయూ నాయకుడు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.





కాకినాడ జిల్లా స్థాయి యోగా పోటీలను ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు

పిఠాపురంలో జిల్లా స్థాయి యోగా పోటీలు

పిఠాపురం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రథాలపేట అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం కాకినాడ జిల్లా స్థాయి యోగాసన పోటీలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, కాకినాడ జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పాల్గొనేందుకు అధిక సంఖ్యలో బాలబాలికలు, పురుషులు తరలివచ్చారు. 8 నుంచి 60 సంవత్సరాల వయసు కలిగిన వారికి విభాగాల వారీగా పోటీలు జరిపారు. అక్టోబరు 25, 26 తేదీల్లో విశాఖలో జరిగే రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో పాల్గొనేందుకు 50 మందిని ఎంపిక చేశారు. పోటీలను డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు ప్రారంభించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు విజేతలకు బహుమతులు అందజేశారు. యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు వనం సత్యప్రియ, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.



కొత్తపట్నంలో మత్స్యకారులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్నకూటమి నాయకులు

మత్స్యకారులకు నిత్యావసరాల పంపిణీ

కొత్తపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉప్పాడ తీరంలో అలల ఉధృతికి సముద్రం నీటితో మునిగిన బాధిత మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం తరఫున పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు ఆదివారం బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. కూటమి నాయకులు పలువురు పాల్గొన్నారు.





సామర్లకోటలో అన్నప్రసాదం వడ్డిస్తున్న ఎమ్మెల్యే తనయుడు రంగనాగ్, గొల్లప్రోలు మండలం గొల్లప్రోలు-రాయవరం రోడ్డులో అన్నదానం



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ నియోజవర్గానికి చెందిన పది మందికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.9,24,536 మంజూరైంది. ఈ మొత్తాన్ని చెక్కుల రూపంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదివారం గొడారిగుంటలోని తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. నాయకులు మాదారపు తాతాజీ, గోపు వెంకటరమణ, పొండ్రంకి రాజు, రామదేవు సీతయ్యదొర తదితరులు పాల్గొన్నారు.



పిఠాపురంలో సమావేశమైన యాదవ సంఘాల ప్రతినిధులు

'యాదవులంతా ఐకమత్యంగా ఉండాలి'

పిఠాపురం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): యాదవులంతా ఒకేతాటిపై ఉండి సంఘ అభివృద్ధికి కృషి చేయాలని యాదవ సంఘాల ప్రతినిధులు నిర్ణయించారు. పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో ఆదివారం సమావేశమైన వీరు పలు అంశాలపై చర్చించారు. పిఠాపురం పట్టణం, పరిసర ప్రాంతాల్లో ఉన్న యాదవులు అందరూ కలిసి కట్టుగా ఒకే కమిటీ ఏర్పాటు చేసుకోవాలని తీర్మానించారు. ఈ ఏడాది కార్తీకమాస వన భోజనాలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు.

పలు సంఘాల ప్రతినిధులు, పెద్దలు అల్లుబోయిన సత్యనారాయణ, పల్లా సింహాద్రి, వియ్యపు రామన్నరాజా, మొల్లి వెంకటరమణ, మఠం వీరబాబు, అల్లుబోయిన అప్పలస్వామి, పల్లా శ్రీను, త్రిమూర్తులు, నానాజీ, గోపాల్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో భారీ అన్నదానాలు

సామర్లకోట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట పట్టణ శివారు ప్రసన్నాంజనేయ నగర్‌లో గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా భక్తుల పట్టాభిరామారావు తదితరుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహాన్నదానాన్ని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, పెద్దాపురం మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు ప్రారంభించారు. 800 మంది అన్నప్రసాదం స్వీకరించారు. ఆర్ఎస్ రత్నాకర్, జోగి బాబు, వీరభద్రరావు, మురళీ మాస్టారు తదితరులు పాల్గొన్నారు. గాంధీబొమ్మ విగ్రహం వద్ద గల రైతు భవన్‌లో కమిటీ ప్రతినిధులు సానివిని హరిబాబు, దేవళ్ల శివ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాన్నదానాన్ని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, ఆయన తనయుడు రంగనాగ్ ప్రారంభించారు. టీడీపీ నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్‌మోహన్ (బాబు), ముసిరెడ్డి శ్రీరాములు, కౌన్సిలర్లు బలుసు శ్రీనివాసు, జయలక్ష్మి, నిమ్మకాయల కిరణ్‌కుమార్, అందుగుల జార్జి చక్రవర్తి, గొలితి సత్యనారాయణ, మల్లిపూడి గంగాధర్, బొందల రామలక్ష్మి, చుంద్రు రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాయవరం రోడ్డులో వరసిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన అన్నదానానికి గొల్లప్రోలు, పరిసర ప్రాంతాల భక్తులు తరలివచ్చారు. జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు పాల్గొనగా కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కాకినాడ సిటీ (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ పూళ్ల వారి వీధిలో వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానాన్ని ముఖ్య అతిథిగా విచ్చేసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం ప్రారంభించారు. ఉత్సవ కమిటీ సభ్యులు గోడి వెంకట్, స్వప్నసౌధ చంద్రశేఖర్, అడపా బద్రీనాథ్ పర్యవేక్షించారు. సత్యనారాయణ చిత్ర బృందం ఆధ్వర్యంలో భక్తి పాటలు ఆలపించారు. జిల్లా నాయకులు యెనిమిరెడ్డి మాలకొండయ్య, దువ్వూరి సుబ్రహ్మణ్యం, కందాల రవి, మాజీ కౌన్సిలర్ జీవీఎస్ శర్మ, మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి, వార్డు నాయకులు వాసిరెడ్డి కుమార్, చలపతి, పిల్లి సత్తిబాబు, శ్రీరాములు, రామకృష్ణ పాల్గొన్నారు.



ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు అందజేస్తున్న దృశ్యం

బీసీ బాలికల వసతి గృహానికి ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్ల వితరణ

కాకినాడ సిటీ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవలో భాగంగా సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కోరంగిలోని బీసీ బాలికల వసతి గృహానికి 10 ఫ్యాన్లు, 10 ట్యూబ్‌లైట్లు అందజేశారు. ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి మేకా లక్ష్మణమూర్తి, విశిష్ఠ అతిథిగా ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ హాజరయ్యారు. కార్యక్రమంలో వసతిగృహం వార్డెన్ అనురాధ, ఎంపీ పీఏ గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

'మత్స్యకారులకు నామినేటెట్ పదవుల్లో ప్రాధాన్యమివ్వాలి'



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న గంగాధర్, మత్స్యకార నాయకులు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధానమివ్వాలని జనసేనకు చెందిన మత్స్యకార నాయకులు డిమాండ్ చేశారు. 25వ డివిజన్ పప్పులమిల్లు ఏరియాలో ఆదివారం జనసేన నాయకుడు మచ్చా గంగాధర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియా సమావేశంలో జనసేన నాయకుడు మచ్చా గంగాధర్, ఆ పార్టీ మత్స్యకార వికాస విభాగం జిల్లా అధ్యక్షుడు మల్లాడి రాజు, ఉమ్మడి జిల్లా సంయుక్త కార్యదర్శి బడే కృష్ణ మాట్లాడారు. త్వరలో జరిగే స్థానిక సంస్థలు, కార్పొరేషన్ ఎన్నికల్లో మత్స్యకారులకు ఎక్కువ సీట్లు కేటాయించాలన్నారు. మేయర్ పదవితో పాటు 16వ డివిజన్‌లో మత్స్యకారులకు పార్టీ తరఫున పోటీ చేసే అవకాశం కల్పించాలన్నారు. సిటీ కార్యదర్శి వాడ్రేవు లోవరాజు, 20వ డివిజన్ ఇన్‌చార్జి బవసని నాగబాబు, చోడిపల్లి సత్యవతి, రచ్చ ధనలక్ష్మి, పణి ఆనంద్, కొంద్రు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



వెటర్నరీ ఏడీ డాక్టర్ ప్రమీల

సామర్లకోట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పశువుల్లో వ్యాప్తి చెందే గాలికుంటు వ్యాధి నివారణకు పశుసంవర్ధక శాఖ జిల్లా సంయుక్త సంచాలకుల ఆదేశాల మేరకు సోమవారం నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు టీకాలు వేస్తామని సామర్లకోట ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకురాలు డాక్టర్ ఈ.ప్రమీల వెల్లడించారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సామర్లకోట, పెదపూడి మండలాల్లోని అన్ని పశు వైద్యశాలల్లో ఈ టీకాలు వేస్తామన్నారు. నాలుగు నెలల వయసు దాటిన నలుపు, తెలుపు జాతి పశువులకు పెంపకందారులు తప్పనిసరిగా టీకా వేయించాలన్నారు. పశువైద్య సిబ్బంది ఆయా గ్రామాలకు వచ్చే ముందు రోజు ప్రత్యేక దండోరా వేయిస్తామని తెలిపారు. పశువుల్లో పాల సంపద తగ్గకుండా ఉండేందుకు రైతులు తమ పశువులకు టీకా వేయించాలని డాక్టర్ ప్రమీల కోరారు.



అలరించిన 'ఘంటసాల ది గ్రేట్' బయోపిక్

అలరించిన 'ఘంటసాల ది గ్రేట్' బయోపిక్

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పద్మప్రియ థియేటర్లో ఆదివారం ఉదయం 'గానగంధర్వ' ఘంటసాల బయోపిక్ ప్రివ్యూ ప్రదర్శించారు. ఘంటసాల పాత్రలో పాడుతాతీయగా ఫేం, ప్రముఖ గాయకుడు కృష్ణచైతన్య నటించారు. దర్శక, నిర్మాత చిత్రజల్లు రామారావు మాట్లాడుతూ అమరగాయకుడు ఘంటసాల బయోపిక్ తీసి తెలుగు ప్రేక్షకులకు కానుకగా అందజేయాలన్న తన చిరకాల కోరిక తీరిందన్నారు. రామారావును సాహితీ స్రవంతి నగర అధ్యక్షుడు మార్ని జానకిరామచౌదరి, పున్నమరాజు ఉమామహేశ్వరరావు, పైండా వెంకటనారాయణ తదితరులు అభినందించారు. మంచి చిత్రాన్ని ప్రదర్శింపజేసిన నిర్వాహకులకు ప్రేక్షకులు ధన్యవాదాలు తెలిపారు.

దర్శక, నిర్మాత రామారావుని సత్కరిస్తున్న సాహితీ స్రవంతి సభ్యులు

చెందుర్తిలో కార్డెన్ సెర్చ్



గొల్లప్రోలు మండలం చెందుర్తిలో రికార్డులు లేకపోవడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చెందుర్తిలో ఆదివారం పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు తెల్లవారుజామున నాలుగు గంటలకే గ్రామానికి చేరుకున్న పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, సిబ్బంది బృందాలుగా విడిపోయి తనిఖీలు చేపట్టారు. అనుమానితుల గృహాలు, వాహనాల రికార్డులను పరిశీలించారు. ఎటువంటి డాక్యుమెంట్లు లేని రెండు ఆటోలు, ఒక కారు, 48 మోటారు సైకిళ్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గ్రామంలోకి వచ్చిన కొత్త వ్యక్తుల వివరాలను పరిశీలించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. గ్రామంలోకి కొత్త వ్యక్తులు వచ్చినా, అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. తనిఖీల్లో గొల్లప్రోలు, పిఠాపురం పట్టణ, రూరల్, కొత్తపల్లి ఎస్ఐలు ఎస్.రామకృష్ణ, మణికుమార్, జానీబాషా, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): ఎస్పీ ఆదేశాల మేరకు పిఠాపురం సీఐ శ్రీనివాస్ నేతృత్వంలో కొత్తపల్లి పోలీసులు ఆదివారం ఉప్పాడ బీచ్ రోడ్డులో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. వాహనాలను తనిఖీ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వలన జరిగే ప్రమాదాలు, హెల్మెట్ ధరించకపోతే కలిగే అనర్థాలపై వాహనచోదకులకు కొత్తపల్లి ఎస్ఐ జి.వెంకటేష్ అవగాహన కల్పించారు.

పాదగయ క్షేత్రానికి పోటెత్తిన భక్తులు



పాదగయ ఆవరణలో పితృ దేవతలకు పిండ ప్రదానాలు చేస్తున్న దృశ్యం

పిఠాపురం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ క్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. మహాలయ పక్షాల్లో పితృ దేవతలకు పిండ ప్రదానాలు చేస్తే మంచిదనే నమ్మకంతో ఉభయ తెలుగు రాష్ట్రాలు, ఒడిసా, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి భక్తులు అధికంగా తరలివచ్చారు. పుష్కరిణిలో స్నానాలు ఆచరించిన అనంతరం పితృ దేవతలకు భక్తులు పిండ ప్రదానాలు చేశారు. వరుస సెలవులు కావడంతో కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్ల దర్శనానికి భక్తులు బారులు తీరారు. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. వారికి అసౌకర్యం కలగకుండా ఆలయ కార్యనిర్వాహక అధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.



ఉచిత నేత్ర వైద్య శిబిరం

కాకినాడ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జగన్నాథపురంలోని సెయింట్ థామస్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం ఏఎల్ ఐ ఫౌండేషన్, శ్రీసూర్య ఐ కేర్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. దీనిని చర్చి ఫాదర్ రెవరెండ్ మణిపాల్ ప్రారంభించారు. 200 మంది పేదలకు ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఏఎల్ ఐ ఫౌండేషన్ సీఈవో రాంప్రకాష్, శ్రీసూర్య కంటి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రిప్రగడ జయంతి సందర్భంగా వస్త్ర దానం



మహిళకు నూతన వస్త్రాలు అందజేస్తున్న మోహనవర్మ

కాకినాడ సిటీ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని మంత్రిప్రగడ వారి సత్రం వ్యవస్థాపకుడు, దాత మంత్రిప్రగడ నరసింహారావు 208వ జయంతి సందర్భంగా ఆదివారం సినిమారోడ్డులోని సత్రం ఆవరణలో పేదలకు వస్త్రదానం, అన్నదానం చేశారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కుమారుడు మోహనవర్మ ముఖ్య అతిథిగా హాజరై వస్త్రాలు అందజేశారు. దేవదాయ శాఖ సహాయ కమిషనరు కనపర్తి నాగేశ్వరరావు, ఈవో సీహెచ్ఎస్ఎన్ఎస్ శ్రీనివాస్, కాకినాడ ఏఎంసీ చైర్మన్ బచ్చు శేఖర్, టీడీపీ నగర ఉపాధ్యక్షుడు మేడిశెట్టి ఈశ్వరరావు (చిన్ని), సత్రం సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అండర్-19 ఎస్జీఎఫ్ఏ షెడ్యూల్ విడుదల

22న జరగాల్సిన ఎంపికలు 19కి మార్పు

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-19 ఆధ్వర్యంలో ఈ నెల 22న జరగాల్సిన వివిధ క్రీడా ఎంపికలను ఈ నెల 19కి మార్పు చేసినట్టు క్రీడా సమాఖ్య కార్యదర్శి వెంకటరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల తేదీలు ప్రకటించడంతో ఈ మార్పు చేసినట్టు ఆయన వివరించారు. 19న కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో సైక్లింగ్, మోడ్రన్ పెంటాథాన్, కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో బీచ్ వాలీబాల్, రాజా ట్యాంక్‌లోని స్కేటింగ్ రింక్‌లో స్కేటింగ్, జి.మామిడాడ ఫ్యామిలీ క్లబ్‌లో టేబుల్ టెన్నిస్, పిఠాపురంలో ఆర్చరీ, కోనసీమ జిల్లా రాజోలులో ఫెన్సింగ్ ఎంపికలు జరుగుతాయని తెలిపారు. సీనియర్ పీడీలు రత్నశామ్యూల్, శివరామకృష్ణ పర్యవేక్షణలో ఎంపికలు నిర్వహిస్తామని, ఆసక్తి గల వారు సంబంధిత పత్రాలతో హాజరు కావాలని వెంకటరెడ్డి కోరారు.

పురాతన ఆరోగ్య శాస్త్రం 'యోగా'



యోగా గురువు జ్యోతుల నాగేశ్వరరావును సత్కరిస్తున్న యోగ సాధకులు

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): శారీరక, మానసిక పురోభివృద్ధికి యోగా సాధన తోడ్పుతుందని యోగా భరత్ ఫౌండేషన్ చైర్మన్, 'యోగరత్న' అవార్డు గ్రహీత, యోగా గురువు డాక్టర్ జ్యోతుల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఆదివారం కాకినాడ సత్కళావాహినిలో 'ఆరోగ్య ప్రదాతతో ఆత్మీయ సమ్మేళనం' కార్యక్రమం నేత్రపర్వంగా సాగింది. ఈ సందర్భంగా జ్యోతుల యోగాను పురాతన ఆరోగ్య శాస్త్రంగా అభివర్ణించారు. రోగ నిరోధక శక్తి పెరగడానికి యోగా దోహదపడుతుందని, తద్వారా జనం రోగాల బారిన పడకుండా ఉంటారని పునరుద్ఘాటించారు. ఒత్తిడిని అధిగమించే శక్తి అల్లోపతి సహా ఏ ఇతర వైద్య విధానాల్లోనూ ఇంతవరకు లేదన్నారు. కేవలం యోగా సాధనతో మాత్రమే ఒత్తిడిని అధిగమించగలమని వివరించారు. ఉరుకులు, పరుగుల జీవితంలో సగటు మనిషి అనేక రోగాల బారిన పడుతున్నాడని.. వీటిలో బీపీ, మధుమేహం, అధిక బరువు, గ్యాస్ట్రిక్, స్పాండిలైటిస్, పీసీఓడీ ప్రధానమైనవన్నారు. వీటిని అధిగమించడానికి యోగా సాధన మార్గం అని చెప్పారు. రోగ రహిత సమాజ నిర్మాణమే ధ్యేయంగా యోగా భారత్ ఫౌండేషన్ పని చేస్తోందన్నారు. ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ ఆధునిక యుగంలో రోగాల బారినపడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోందన్నారు. వాటి నుంచి దూరం కావడానికి అమృతతుల్యమైన ప్లాట్‌ఫారం కేవలం యోగా మాత్రమేనని వివరించారు. వందలాది సాధకులు, ఆరోగ్యభిలాషులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గండేపల్లి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో మల్లేపల్లి, ఎన్టీ రాజాపురం, నాయంపల్లి, యర్రంపాలెం గ్రామాలకు సోమవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాకు అంత రాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ బి.వీరభద్రరావు, గండేపల్లి, ఏఈ కిరణ్ తెలిపారు. విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక


తొలి జాతీయ మహిళా సాధికారిత సదస్సులో తుమ్మల ఆదివాసీల సంప్రదాయ నృత్యం

ఆదివాసీ సంప్రదాయ నృత్యానికి
ఉత్తమ ప్రదర్శన సత్కారం

చింతూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తొలి జాతీయ మహిళా సాధికారత సదస్సులో తుమ్మల ఆదివాసీ కళాకారులు ఉత్తమ ప్రదర్శన సత్కారం పొందారు. తిరుపతి శివారులోని రాహుల్ కన్వెన్షన్‌లో తొలి జాతీయ మహిళా సాధికారిత సదస్సు జరిగింది. శని, ఆదివారం జరిగిన ఈ కార్యక్రమలో రాష్ట్రంలోని వివిద సంప్రదాయ నృత్యాలను కళాకారులు ప్రదర్శించారు. ఇందులోభాగంగా ఆదివారం రాత్రి చింతూరు మండలం, తుమ్మలకు చెందిన ఆదివాసీ సంప్రదాయ కళాకారులు బృంద నాయకు డు పట్రా రమేష్‌బాబు నేతృత్వంలో డోలు కొయ్యల నృత్యాన్ని ప్రదర్శించారు. ఈ ప్రదర్శన పలువురిని ఆకర్షించడమే కాకుండా సదస్సు నిర్వహకులచే ఉత్తమ ప్రదర్శన సత్కారం పొందింది, ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతితో పట్రా రమేష్‌బాబు మాట్లాడుతూ ఇంతటి పెద్ద కార్యక్రమంలో ఆదివాసీ కళాకారులకు గుర్తింపు రావడం సంతోషకరంగా ఉందన్నారు. ఏపీ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు రంప చోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషతో పాటు పలువురు మహిళా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ఇసుక లారీల రద్దీ

● రాకపోకలకు ఆటంకం ● పట్టించుకోని అధికారులు


ఏపీలోని గుండాల వరకు నిలిపి ఉన్న ఇసుక లారీలు

ఎటపాక, సెప్టెంబరు13 (ఆంధ్ర జ్యోతి) ఎటపాక మండలం రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారిపైన గుండాల వరకు ఇసుక లారీల రద్దీ కారణంగా వాహన రాకపోకలకు అడ్డంకిగా మారాయి. చత్తీస్‌గడ్‌లోని కుంట ప్రాంతం నుంచి ఇసుకలోడ్‌తో లారీలు తెలంగాణ ప్రాంతంవైపు తరలిస్తున్న క్రమంలో సరిహద్దులోని భద్రాచలం పట్టణ శివారులో ఉన్న కొల్లుగూడెం ర్యాంపులో వేబ్రిడ్జివద్ద ఇసుక బరువు లెక్కిస్తున్నారు. బరువు లెక్కించిన అనంతరం ఇసుక లారీలు తెలంగాణలోని వివిధ ప్రాంతాలకు ఇసుక రవాణా జరుగుతోంది. ఇసుక లారీల సంఖ్య ఎక్కువ మొత్తంలో రావడంతో సుమారు కిలోమీటర్ దూరం వరకు ఏపీ పరిధిలో గుండాల వనకు ఇసక లారీలు నిలిచిపోతున్నాయి. దీంతో ఈవైపుగా వాహనరాకపోకలు సాగించే వారికి ఇసుక లారీల రద్దీ అడ్డంకిగా మారాయి. వారంరోజులుగా ఇసుక లారీలు జాతీయ రహదారిపై నిలిపి ఉంచడంతో వాహనదారులు రాకపోకల సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెలంగాణలో ఇసుక లారీలు నిలిపే అవకాశం ఉన్నా, ఏపీ పరిధిలో నిలిపివేస్తున్నారు. ఇసుక లారీలు జాతీయ రహదారిపై ఇష్టానుసారం నిలుపుతున్నా అధికారులు పట్టించుకో వడంలేదనే విమర్శలు వస్తున్నాయి. అధికారులు ఇకనైనా స్పందించి ఏపీ పరిధిలో నిలిపుతున్న ఇసుక లారీలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

గిరిజనులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ


గిరిజనులకు పనిముట్లు అందజేస్తున్న ఆషా సంస్థ సెక్రటరీ సయ్యద్ సుభాని

మోతుగూడెం, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో మెట్ట వ్యవసాయం కొండపోడు వ్యవసాయం సులువుగా చేసుకునేందుకు వ్యవసాయ పనిముట్లు చాలా దోహదం చేస్తాయని ఆషా సంస్థ సెక్రటరీ సయ్యద్ సుభాని అన్నారు. ఆదివారం మోతుగూడెం క్లస్టర్‌లోని మల్లవారం, తడికివాగు, రాజుక్యాంపు, గంగవాడ, శాంతినగర్ ఆవాసాలలో ఆశా సంస్థ తరపున నిరుపేద గిరిజన రైతులకు వ్యవసాయ పనిముట్లు ఉచితంగా అందించారు. ఒక్కొక్క కుటుంబానికి గునపము, పార, గమిలా, కొడవలి, పికాస చొప్పున మొత్తం ఐదు పనిముట్లు విలువ సుమారు రూ.1000. ఇవి 50 కుటుంబాలకు అందించారు. ఈ పనిముట్లు జాగ్రత్తగా వాడుకొని తమ పనులను సులువుగా చేసుకునేందుకు వీలవుతుందని ఆషా సంస్థ సెక్రటరీ తెలిపారు. పనిముట్లను ఉచితంగా అందించిన ఆశా సంస్థకు ధన్యవాదాలు తెలిపి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆశాసంస్థ సంయుక్త కార్యదర్శి జట్పాటి వెంకటేష్, వలంటీర్ అందాల రమణారెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

భూ పోరాటాలపై స్పష్టత ఉంది

కూనవరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి):తాము చేస్తున్న భూ పోరాటాలపై స్పష్టత ఉందని సీపీఎం అనుబంధ గిరిజన సంఘం నాయకులు తెల్లం తమ్మయ్య అన్నారు. పోలవరం పరిహారం తీసుకుని ఇక నుంచి వెళ్లిపోయిన గిరిజననేత భూములపైనే తాము పోరాటం చేస్తున్నామన్నారు. ఏజెన్సీలో చట్టాలు ఎలా ఉంటాయో బీజేపీ నాయకులు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో బొగ్గ రామారావు, పాయం సీతారామయ్య, మడకం నాగమణి, పొడియం రామారావు పాల్గొన్నారు.

రాజవొమ్మంగిలో హిందీ పరీక్షలు

రాజవొమ్మంగి సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆదివారం హిందీ దివా స్ సందర్భంగా రాజవొమ్మంగిలో హిందీ టీచర్ హరిశ్చంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ హైదరాబాద్ హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో విద్యార్థులకు హిందీ పరీక్షలు నిర్వహించారు. 60మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పరీక్షలు అనంతరం భోజన ఏర్పాట్లు చేశారు.

జలజలా పారుతున్న జలాశయాలు

● పర్యాటక ప్రాంతాలు కళకళ

మోతుగూడెం, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పొల్లూరు జలపాతానికి శని, ఆదివారం వారాల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు ఈ రెండు రోజులు మోతుగూడెం పర్యాటక ప్రాంతాలు కళకళలాడుతున్నాయి పొల్లూరు ధారాలమ్మ గుడి, సీలేరు నది ప్రవహిక ప్రాంతాలు, పొల్లూరు జలపాతాలు, ఎగువ దిగువ ఫోర్ బై డొంకరాయి జలాశయాలు, జల విద్యుత్ కేంద్రాలను సందర్శించి వాటి అందాలను సెల్‌ఫోన్‌లో బంధించారు.


జలపాతాలు వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

చెరువులా ప్రత్తిపాడు బస్టాండ్

● అధ్వానంగా రహదారులు ● పట్టించుకోని అధికారులు


ధర్మవరం 4వ వార్డులో అధ్వానంగా ఉన్న రహదారి

ప్రత్తిపాడు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు మండలంలోని రహదారులు అధ్వానంగా మారాయి. ముఖ్యంగా ప్రత్తిపాడులోని అల్లూరి సీతారామరాజు జంక్షన్, ఒమ్మంగిలోని కూడలి, ప్రత్తిపాడు, ఏలూరు రహదారులు అధ్వానంగా మారాయి. స్థానిక బస్టాండ్ ఎదురుగా చిన్నపాటి చెరువులా వర్షపునీరు నిల్వ ఉంది. ధర్మవరం సత్తెమ్మతల్లి గుడి వీధి 4వ వార్డులో గల రహదారి బురదమయంగా మారింది. ఇదే పరిస్థితి శరభవరం, గజ్జనపూడి, చింతలూరు, పోతులూరు గ్రామాల్లో ఉంది. అధికారులు వెంటనే మండల రహదారుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


చిన్నపాటి చెరువును తలపిస్తున్న ప్రత్తిపాడు ఆర్టీసీ కాంప్లెక్స్

ఫిషర్‌మెన్ సొసైటీ సభ్యులకు సత్కారం

గండేపల్లి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎన్టీరాజాపురం గ్రామంలో ఫిషర్‌మెన్ సొసైటీ సభ్యులుగా ఎన్నికైనా పాలకవర్గాన్ని ఆదివారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్, మండలపార్టీ అధ్యక్షుడు పోతుల మోహన్ రావు, గండేపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు కంటిపూడి సత్యనారాయణ, కె. బాబి, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఫిషర్‌మెన్ సభ్యులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

ఎమ్మెల్యే నెహ్రూను కలిసిన ఇజ్జన రాములు ప్యానల్

జగ్గంపేట(ఆంధ్రజ్యోతి):గండేపల్లి మండలం ఎన్టీ రాజాపురం మత్స్య సహకార సంఘం నెంబర్ బి.14నూతన పాలకవర్గ ఎన్నికల్లో ఇజ్జీన రాములు ప్యానల్ విజయం సాధించింది. జగ్గంపేట రావుల మ్మనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో గండేపల్లి సొసైటీ చైర్మన్ కంటిపూడి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను కలిశారు. విజయం సాధించిన వారందరినీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఘనంగా సత్కరించి శుభా కాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో రాబోయే ఐదు సంవత్సరాలు మత్స్య సహకార సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఆదరణ పథకంద్వారా పనిముట్లు అందజేస్తామన్నారు. కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహన్ రావు, కంటిపూడి సత్యనారాయణ, కేతిన వెంకన్నచౌదరి, కాను కలను శ్రీను, జాస్తి సత్యనారాయణ, సానిపిని విశ్వేశ్వరరావు, సానిపిని రాజేంద్ర, బొల్లిన వాసు, కాను కొలను వాసు, గుర్రం శ్రీను, వింజరపు పెద్దకాపు, ఆరుగొల్లు లక్ష్మణ్, బత్తిన కనకరాజు పాల్గొన్నారు.

తాండవ పరవళ్లు


తుని వద్ద పరవళ్లు తొక్కుతున్న తాండవ మినీ రిజర్వాయర్

తునిరూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎగువన కురిసిన వర్షాలతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. కొండల నుంచి దిగి వచ్చిన వర్షపు నీరు పిల్ల కాలువల గుండా తాండవ నదిలోకి చేరడంతో తునివద్ద మిని రిజర్వాయర్‌లో తాండవ నది పరవళ్లు తొక్కుతుంది. ఈ దృశ్యాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.

దళితులపై దాడి పునరావృతం కాకుండా చూడాలి

ఎటపాక,సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): దళితులను కులం పేరుతో దూషిం చడం, దాడి చేయడం వంటి చర్యలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కూనవరం మండలం మాల మహానాడు అధ్యక్షుడు మోతుకూరి వెంకన్న తెలిపారు ఇటీవల దాడికి గురైన గౌరిదేవిపేట గ్రామానికి చెందిన గవ్వల వెంకటేష్‌ను ఆదివారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి 25 కేజీల రైస్‌బ్యాగ్, నిత్యవసరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు ఆనంద్, గణేష్, రాంబాబు, దారా రవి, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట

మహిళా సాధికారత జాతీయ సదస్సులో ఎమ్మెల్యేలు దివ్య, సత్యప్రభ, శిరీష


మహిళా సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యేలు వరుపుల సత్యప్రభ, మిరియాల శిరీషదేవి, యనమల దివ్య, తదితరులు

చింతూరు, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. తిరుపతి శివారులోని రాహుల్ కన్వెన్షన్ ప్రాంగణంలో శని, ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన తొలి జాతీయ మహిళా సాధికారిత మొదటి సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. మహిళలు అన్నిరంగాలలో అభివృద్ధి చెందాలన్నారు. ఆమేరకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రత్తిపాడు(ఆంధ్రజ్యోతి): తిరుపతి కేంద్రంలో మహిళా సాధికారతపై నిర్వహించిన జాతీయ సదస్సులో కాకినాడ జిల్లా ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా పాల్గొన్నారు. ఆది, సోమ రెండు రోజులపాటు తిరుపతి రాహుల్ కన్వెషన్ సెంటర్‌లో పార్లమెంట్, శాసనసభ కమిటీల జాతీయ సదస్సు అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగింది. ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ స్త్రీ శిశు, వికలాంగుల సంక్షేమ కమిటీ సభ్యురాలు హోదాలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యపభ ఈ మహిళా సాధికారత జాతీయ సదస్సులో హాజరయ్యారు. ఈ జాతీయ సదస్సులో ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ మహిళా సాధికారతపై పలు అంశాలను సమావేశం దృష్టికి తెచ్చినట్లు ఆమె తెలిపారు.

జాతీయ సదస్సులో ఎమ్మెల్యే దివ్య

తుని రూరల్(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరిగిన మహిళా శాసనకర్త జాతీయ సదస్సులో ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య హాజరయ్యారు. తిరుపతిలో రెండు రోజులపాటు నిర్వహించే కేంద్ర, రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల మహిళా శాసనకర్తలకు ఈ జాతీయ సదస్సు తిరుపతిలో జరిగింది. దేశంలోని వివిధ చట్టసభలకు సంబంధించిన మహిళా శాసనకర్తలు వివిధ అంశాలపై జరిగిన చర్చలో మహిళా శాసన సభ్యులు పాల్గొనగా వారిలో తుని ఎమ్మెల్యే యనమల దివ్య ఉన్నారు.

జీఎస్టీ తగ్గుదలతో నిర్మాణదారులకు ఊరట


కుమ్మరిలోవ వద్ద సాగుతున్న ఇళ్ల నిర్మాణం

తునిరూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జీఎస్టీ విధానంతో గృహ నిర్మాణదారులకు పెద్ద ఊరట లభించింది. ఇసుక, సిమ్మెంటుపై గతంలో 28శాతం ఉన్న జీఎస్టీని 18శాతానికి, ఇటుక, టైల్స్‌పై ఉన్న 12శాతం జీఎస్టీని 5శాతానికి తగ్గించింది. తగ్గిన జీఎస్టీతో పేద, మధ్య తరగతి గృహ నిర్మాణం కల సాకారం అవ్వబోతుంది. గత ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేసింది. నిర్మాణ ఖర్చులు భారీగా పెరిగిపోవడంతో ఆయా గ్రామాల్లో ప్రభుత్వ లేఅవుట్‌లలో 70శాతం లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోలేదు. సామాన్యులు ఇంటి నిర్మాణం కోసం రూ.16లక్షల వరకు ఖర్చు అవ్వగా తగ్గిన జీఎస్టీతో 3శాతం వరకు అంటే దాదాపు రూ.50వేలు వరకు ఆదా అవుతుంది.

లయన్స్‌క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



ప్రమాణస్వీకారం అనంతరం నూతన కార్యవర్గసభ్యులు

అన్నవరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ ఆఫ్ అన్నవరం సత్యదేవ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం ఆదివారం అన్నవరం లయన్స్‌భవనంలో అట్టహాసంగా జరిగింది. నూతన అధ్యక్షుడిగా అడపా సత్తిబాబు, కార్యదర్శిగా పొన్నాడ సూరిబాబు, కోశాధికారిగా బుడ్డిగ వాసు ప్రమాణస్వీకారం చేశారు. వీరితో పూర్వపు డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆలపాటి సుబ్బారావు ప్రమాణస్వీకారం చేయించారు. ఈసందర్భంగా అన్నవరం క్లబ్‌ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారని నూతనకార్యవర్గం మరింత ముం దుకు తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో పర్వత జానకీదేవి, డొంకాడ గిరి, పంచాది గుర్రాజు పాల్గొన్నారు.

నరేంద్రగిరి కొండపై తుప్పలు తొలగింపు


నరేంద్రగిరి కొండపై పిచ్చిమొక్కలను తొలగిస్తున్న స్వచ్ఛంద సేవకులు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి):ప్రత్తిపాడులోని ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లుతున్న నరేంద్రగిరి కొండపై పిచ్చిమొక్కలు తొలగించే కార్యక్రమాన్ని ఆదివారం స్వచ్ఛంద సేవకులు నడుం కట్టారు. పెద్దాపురం డివిజన్ క్రైం సీఐ రాజుల పాటి అంకబాబుతో పాటు నరేంద్రగిరి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గుడాల వెంకటరత్నం, కార్య దర్శి సింగిలిదేవ్ సత్తిరాజు, ఉప కోశాధికారి రేపాకప్రసాద్ తదితర స్వచ్ఛంద సేవకులు నరేంద్రగిరి కొండపై మెట్ల మార్గాన్ని మూసివేసిన పిచ్చితుప్పలను తొలగించారు. స్వయం సేవక్ ముక్కు సుబ్రహ్మణ్యం, చిట్రా అప్పారావు, ఆంజనేయులతో పాటు స్వయం సేవక్‌లు ఈకార్యక్ర మంలో పాల్గొన్నారు.

టీచర్ ఉద్యోగాలు సాధించిన 23 మందికి సత్కారం


జ్యోతుల నెహ్రూ కుటుంబాన్ని సన్మానించిన డీఎస్సీ అభ్యర్థులు

జగ్గంపేట, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): స్థానిక రావులమ్మనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా నిర్వహించిన ఉచిత టెట్ డీఎస్సీ కోచింగ్‌లో 23మంది ఉపాధ్యాయఉద్యోగాలు సాధించడం తో వారికి జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్, జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ చైర్మన్ జ్యోతుల మణి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన 23 మంది మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కువ మంది ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించాలనే ఉద్దేశంతో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా సకల వసతులు కల్పించి బెస్ట్ ఫ్యాకల్టీతో బెస్ట్ మెటీరియల్ తో చక్కని వసతి, భోజన వసతితో పాటు మా స్వస్థలాలకు వెళ్లేందుకు బస్సులు ఏర్పాటుచేసి మమ్మల్ని ఈరోజు టీచర్లుగా ఉద్యోగాలు సాధించడానికి అన్ని రకాలుగా సహాయ సహకా రాలు అందించిన జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ చైర్మన్ జ్యోతుల మణి, జ్యోతుల నవీన్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు జీవితకాలం రుణపడి ఉంటామన్నారు. జ్యోతుల మణి, నవీన్ , ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూజ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా మీ అందరికీ ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంతో ఏర్పాటైన ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్‌కు 400 మందికి పైగా కోచింగ్ తీసుకుంటే ఈరోజు 23మంది ఉపాధ్యాయులుగా ఉద్యోగం సాధించడం చాలా ఆనందంగా ఉందన్నారు. చాలామంది అర మార్కు, ఒక మార్కు తేడాతో క్వాలిఫై అవ్వక పోవడం చాలా దురదృష్టకరమన్నారు. వృద్ధాశ్ర మం కూడా ఏర్పాటు చేయాలని లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, అడపా భరత్, కొత్తకొండబాబు, పోతుల మోహన్‌రావు, వీరంరెడ్డి కాశిబాబు, పిల్లా చంటిబాబు, బస్వా వీరబాబు, తోట రవి, కోర్పుసాయి తేజ, గాంధీ, అడబాల భాస్కరరావు, ఉంగరాల రాము, పాల చర్ల నాగేంద్ర చౌదరి, పాఠంశెట్టి రవి, సొసైటీ ప్రెసిడెంట్లు, క్లస్టర్ ఇన్చార్జిలు, సర్పంచులు, ఎంపీటీసీలు, జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్‌కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


రథంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

ఘనంగా రథోత్సవం

● రత్నగిరి కొండపై విహరించిన స్వామి, అమ్మవారు

అన్నవరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రత్నగిరి వాసుడైన సత్యదేవుడికి ఆదివారం రథోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తూర్పురాజగోపురం వద్దకు మేళతాళాలతో తోడ్కొని వచ్చారు. ప్రత్యేకపూజలు అనంతరం భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల మంత్రోచ్చరణల నడుమ ముమ్మారు ప్రదక్షణ గావించారు. అనంతరం హారతులిచ్చి ప్రధా నాలయానికి తీసుకెళ్లారు.

నేడు, రేపు ఆదిత్య వేద-2కే25

గండేపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి):మండలంలో సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి టెక్ ఫెస్ట్ ఆదిత్య వేద-2కే25కు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రో.ఛాన్సలర్ డాక్టర్ సల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ వేద పేరిట జాతీయస్థాయిలో టెక్‌ఫెస్ట్ సెప్టెంబర్ 15, 16 తేదీల్లో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో దేశం నలుమూలల నుంచి పాల్గొనే ఇంజనీరింగ్ విద్యార్థులు తమ కళాశాల నుంచి నేరుగా రిజిస్టర్ చేసుకోవచ్చని తెలిపారు. ఇంజనీరింగ్ విద్యార్థులలో ఉన్న నైపుణ్యాన్ని వెలుగు తీసేందుకు మరింతగా ద్విగుణీకృతం చేసుకొనేందుకు ఆదిత్య వేద ద్వారా వివిధరకాల అంశాలలో పోటీలు నిర్వహించి ప్రశంసా పత్రాలు, జ్ఞాపి కలు, నగదు బహుమతులతో వారిని ప్రోత్సాహి స్తామన్నారు. ప్రాజెక్టు పోస్టర్, పేపర్ ప్రజంటేషన్స్ తదితర విభాగాలలో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

ఘనంగా అన్న సమారాధన

జగ్గంపేట, సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి మండలం రామచంద్రపురం గ్రామంలో పద్మశాలి పేటలో వినాయక మండపం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో జగ్గంపేట జనసేన పార్టీ ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ పాల్గొని భక్తులకు భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో భారీ స్థాయిలో భక్త లు, జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

తొండంగి,సెప్టెంబర్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒంటిమామిడి సమీపంలో కృష్ణాపురం సెంటర్ వద్ద శనివారంరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం పాలయ్యాడు. కృష్ణాపురం అవంతి సీఫుడ్స్‌లో పనిచేస్తున్న విజయనగరం జిల్లా బోడంగి మండలం రాజేరు గ్రామానికి చెందిన పోతాబత్తుల చరణ్‌కుమార్(20) పని ముగించుకుని మోటారుసైకిల్‌పై ఇంటికి వెళుతుండగా కృష్ణాపురం సెంటర్‌లో పాఠశాల మలుపువద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో సమీపంలోని కాలువలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తొండంగి ఎస్ఐ జగన్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శిథిలావస్థలో గౌరంపేట పాఠశాల భవనం

● కూల్చకుంటే ప్రమాదమే

శంఖవరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గౌరంపేటలో పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన పాఠశాల నిర్మించి విద్యార్థులను అక్కడికి తరలించారు. నూతన పాఠశాల నిర్మాణం పూర్తయి ఏడాది కావొస్తున్నా శిథిల భవనాన్ని అలాగే వదిలేశారు. వర్షాలకు కొంత కూలిపోతూ గ్రామస్థులను భయపెడుతుంది. శెలవు సమయ ంలో చిన్నారులు అదే శిథిల పాఠశాలలో ఆడుకుంటూ ఉండటంతో ఈభయం తల్లిదండ్రులకు మరింత ఎక్కువవుతుంది. పాఠశాల భవనాన్ని కూల్చి విద్యార్థులకు ఆటస్థలంగా అభివృద్ధి చేయాలని పలుమార్లు గ్రామస్థులు వినతులు ఇచ్చినా విద్యాశాఖ మాత్రం పట్టించుకోకుండా మీనమేషాలు లెక్కిస్తుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


గౌరంపేటలో శిథిలమైన పాఠశాల భవనం